క్లుప్తంగా

28న చంద్రబోస్‌కు అభినందన సభ

గన్‌ఫౌండ్రీ: ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్‌కు ఈనెల 28న రవీంద్రభారతిలో అభినందన సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం రవీంద్ర భారతిలోని సాహిత్య అకాడమీ కార్యాలయంలో అభినంద సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొట్టమొదటి సారి తెలుగు పాటకు అంతర్జాతీయ స్థాయిలో అవార్డు రావడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచిత్తం శ్రీధర్, తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి ఆనందచారి, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాప్రోలు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జూలూరు గౌరీశంకర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సాహిత్య రంగంలో ఆచార్య ఎస్వీ.రామారావు రచించిన సమగ్ర తెలంగాణ వాఙ్మయ కోశం గ్రంథం భావి తరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరిశంకర్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో ఎస్వీ రామారావు ఇటీవల ప్రచురించిన గ్రంథాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ.. తెలంగాణలో 1వ శతాబ్దం నుంచి నేటి వరకు రచనలు చేసిన రచయితల సమగ్ర సమాచారాన్ని ఈ గ్రంథంలో పొందుపరచడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచిత్తం శ్రీధర్, విశ్రాంత కలెక్టర్ ముక్తేశ్వర్ రావు, కవి కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం



అబిడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేపడుతామని గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏఎస్‌రావు పేర్కొన్నారు. ఇంద్రానగర్, ఆర్‌కే పేట్, అంబేడ్కర్‌నగర్, కుమ్మరివాడి, బస్తీల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ ఏఎస్‌రావు మాట్లాడుతూ.. బస్తీల్లో తెలుసుకున్న ప్రజా సమస్యలను సంబంధిత జీహెచ్‌ఎంసీ, వాటర్ బోర్డు, విద్యుత్, ఇతర శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ రఫీక్, మహ్మద్ షరీఫ్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డితో పాటు పలువురు డాక్టర్ ఏఎస్‌రావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.

బాబురావు మృతదేహం వెలికితీత

బహదూర్‌పురా: మీరాలం ఫిల్టర్‌లో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన బాబురావు మృతదేహన్ని కాలాపత్తర్ పోలీసులు బుధవారం తెల్లవారుజామున వెలికితీశారు. మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పదస్థితి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మీరాలం ఫిల్టర్‌లోని ఓ చానల్ నీటిని పూర్తిగా నిలిపివేశామని.. ఇతర చానల్ల ద్వారా యథావిధిగా కొనసాగిస్తున్నామని జలమండలి అధికారులు తెలిపారు.

ముగ్గురు పిల్లలతో సహా గృహిణి అదృశ్యం

గౌలిపురా: ముగ్గురు పిల్లలతో కలిసి ఓ గృహిణి అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్‌కు చెందిన మహ్మద్ జావీద్, రోషన్ అర (22) దంపతులు. వీరికి మహ్మద్ అలీ (7), అలీనా ఫాతిమా (3), అలీసా పర్వీన్ (2)లు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈనెల 13న రోషన్ ఆర తన ముగ్గురు పిల్లలతో కలిసి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో మహ్మద్ జావీద్ తన భార్య, ముగ్గురు పిల్లలు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

గోల్కొండ: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మెహిదీపట్నంలోని ఎక్కువ పరీక్ష కేంద్రాలు ఉండటంతో ఉదయం 7:30 నుంచి కళాశాలల వద్ద విద్యార్థులు వారి, కుటుంబసభ్యుల సందడి మొదలయ్యింది. సెయింటాన్స్ కాలేజ్, పుల్లారెడ్డి కళాశాల తదితర ప్రాంతాల్లో విద్యార్థులు నిర్దేశించిన సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. టోలిచౌకి గుడిమల్కాపూర్‌లోని పరీక్ష కేంద్రాల వద్ద పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

సంతోష్‌నగర్‌లో..

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. సంతోష్‌నగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాల, శ్రీమేధ జూనియర్ కళాశాల, హిదాయా జూనియర్ కళాశాల, సెయింట్ మాథ్యూస్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించిన అనంతరం పరీక్ష కేంద్రంలో అధికారులు అనుమతించారు. పరీక్షల సందర్భంగా సంతోష్‌నగర్ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.



సంతోష్‌నగర్‌లోని నారాయణ కళాశాల వద్ద పరీక్షకు హాజరైన విద్యార్థులు

వేసవిలో నీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ

గోల్కొండ: వేసవిలో నీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం జలమండలి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓ వైపు వేసవి, మరో వైపు ఈ నెలలోనే రంజాన్ మాసపు ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ రెండింటిని దృష్టిలో పెట్టుకుని అధికారులు నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. జలమండలి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పుడూ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. అయితే వేసవిలో కార్వాన్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో నీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడడమే కాకుండా లో ప్రెషర్ సమస్య తలెత్తుతుందని ఆయన అన్నారు. ఎత్తయిన బస్తీల్లో లో ప్రెషర్ సమస్య ఎక్కువగా ఉందని ఆయన అన్నారు. అటువంటి ప్రదేశాలను గుర్తించి పవర్ బూస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడానికి ట్యాంకర్లతో పాటు సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని ఆయన సూచించారు. కార్వాన్‌లో ప్రస్తుతం డ్రైనేజీ, వరద నీటి పైప్‌లైన్ పనులు జోరుగా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలతో పాటు ప్రార్థనా స్థలాల పరిసరాలలో జరుగుతున్న పనులను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయించాలన్నారు. కార్వాన్, టోలీచౌకి డివిజన్లలో జరుగుతున్న పైప్‌లైన్ పనులను ఉన్నతాధికారులు పరిశీలించి అవి సకాలంలో పూర్తయ్యేలా చూడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఆపరేషన్స్ డైరెక్టర్ కృష్ణ అజ్మీర, జలమండలి డీజీఎం ఖాజా జవహర్‌అలీ, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసిరుద్దీన్, మజ్లిస్ సీనియర్ నాయకులు హారూన్ ఫర్హాన్, బజరుద్దీన్ తదితరులు ఉన్నారు.



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఆర్థిక చేయూత



శ్రీలక్ష్మికి చెక్కును అందజేస్తున్న సింగరేణి జీఎం సురేష్

నాంపల్లి: ప్రతిభావంతులైన సింగరేణి పిల్లలను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన మెరిట్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలతో అనేక మంది లబ్ధి పొందారని జనరల్ మేనేజర్ (కో–ఆర్డినేషన్) ఎం.సురేష్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ పర్చేజ్ విభాగంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీలక్ష్మి కుమారుడు ఐఐటీ చదువు కోసం మంజూరైన రూ.లక్ష ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కును అందజేసిన ఆయన ప్రసంగించారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు సంస్థ చైర్మన్ ఎన్.శ్రీధర్ ఆదేశాలతో ఐదేళ్ల క్రితం ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రారంభించామని, ఐఐటీ, ఐఐఎం వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో చదువుకు సుమారు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ట్యూషన్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ ట్యూషన్ ఫీజు మొత్తాన్ని సింగరేణి సంస్థ భరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ భాస్కర్, డీజీఎం (పర్చేజ్ విభాగం) విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాను మరణిస్తూ.. మరో ఐదుగురికి ప్రాణం పోస్తూ..



సుభాష్ చందర్

సాక్షి, సిటీబ్యూరో: తాను మరణిస్తూ మరో ఐదుగురికి ఓ ఎస్‌ఐ ప్రాణాలను పోశాడు. సంగారెడ్డిలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కొమ్ముల సుభాష్ చందర్(59) కుమారుడి పెళ్లి ఇటీవల కుదిరింది. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్న సమయంలోనే ఆనోం దత్సాహంలో ఉన్న సుభాష్ చందర్ ఇంట్లో మెట్లు ఎక్కుతుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. తలకు బలమైన గాయం కావడంతో ట్రీట్ మెంట్ కోసం ఆయనను హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సుభాష్ చందర్ బ్రెయిన్ డెడ్ అయినట్లుగా ప్రకటించారు. ఇది వరకే సుభాష్ చందర్ ఒప్పందం ప్రకారం ఆయన అవయవాలు దానం చేసేందుకు కుటుంబసభ్యులు ముందుకొచ్చారు. ఇందులో భాగంగా ఆయన నుంచి రెండు కిడ్నీలు, లివర్, రెండు కార్నియాలను జీవన్ ధాన్ ట్రస్ట్ సేకరించింది. అనంతరం ఆయన అంత్యక్రియలు సంగారెడ్డిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తాను మరణిస్తూ మరో ఐదుగురికి ప్రాణం పోసిన సుభాష్ చందర్ ఆదర్శనీయుడని ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు.

టైగర్‌ను దత్తత తీసుకున్న చిన్నారి



దత్తతకు సంబంధించిన చెక్కును అందజేస్తున్న రియా కాలాహస్తితో పాటు తల్లిదండ్రులు

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కులోని లయన్ బెంగాల్ టైగర్‌ను రియా కాలహస్తి తన 5వ జన్మదినం సందర్భంగా దత్తత తీసుకుంది. తల్లిదండ్రులైన డాక్టర్ ప్రత్యూష, దిలీప్‌తో కలిసి బుధవారం జూపార్కును సందర్శించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని రాయల్ బెంగాల్ వైట్ టైగర్‌ను 3 నెలల 20 రోజులకయ్యే రూ.30 వేల చెక్కును జూపార్కు క్యూరేటర్ రాజశేఖర్‌కు అందజేశారు. జన్మదినం సందర్భంగా వన్యప్రాణుల దత్తతకు ముందుకొచ్చిన చిన్నారిని జూపార్కు అధికారులు అభినందించారు.

ఆకట్టుకున్న గజల్ కచేరి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశంలోనే ప్రథమ స్థానంలోనే నిలిచిందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో ప్రముఖ రచయిత అంజనీకుమార్ గోయల్ మెహతాబ్ గజల్, తస్వీర్ గజల్ పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గజల్ కచేరి ఆహుతులను ఆకట్టుకుంది. ప్రొఫెసర్ ఎస్ఏ షుకూర్, డాక్టర్ ఫారుక్ షకీల్, ప్రకాష్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫామ్ కుట్టే కార్మికుల కూలీ రేట్లు పెంచాలి

సుల్తాన్‌బజార్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్కూల్స్ యూనిఫామ్ కుట్టే కార్మికుల కూలీ రేట్లు పెంచాలని తెలంగాణ టైలర్స్ జేఏసీ ప్రతినిధులు నర్సింగ్‌రావు, కల్పన, కరుణాకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు లక్ష పై చిలుకు కార్మికులు స్కూల్స్ యూనిఫామ్‌లను తయారు చేసి పంపిణీ చేయడం జరుగుతుందని, ఒక యూనిఫామ్‌కు ప్రభుత్వం ఇచ్చే రూ.50 సరిపోవడం లేదని, కనీసం రూ.100 ఇవ్వాలని కోరారు. యూనిఫామ్‌కు కుట్టే దారంతో పాటు రవాణా, లేబర్ ఛార్జీలు పెరగడం వల్ల ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2022–2023 విద్యా సంవత్సరానికి సకాలంలో తాము యూనిఫామ్ కుట్టి అన్ని ప్రభుత్వ స్కూల్స్‌కు పంపిణీ చేశామని ఇప్పటి వరకు బకాయి బిల్లులను మంజూరు చేయలేదన్నారు. తక్షణమే బకాయి నిధులను విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు రాజేశ్వరి, రమేష్, వెంకటరెడ్డి, కాశీనాథ్, శ్రీనివాస్‌రెడ్డి, కనుకరాజ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధులు నర్సింగ్‌రావు

అదానీపై ఈడీ, సీబీఐ విచారణ జరపాలి



నిరసనలో పాల్గొన్న ఫిషర్ మెన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలను దగా చేస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. మంగళవారం గోషామహల్ నుంచి ఎంజేమార్కెట్ మీదుగా గాంధీభవన్ వరకు చేపట్టిన భారీ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భాగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ పాలన చేస్తుందన్నారు. అదానీపై ఈడీ, సీబీఐ విచారణ జరపాలని మెట్టు సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అదానీ ఆర్థిక అవకతవకలపై జేపీసీ విచారణ చేపట్టాలి..

గౌలిపురా: అదానీ ఆర్థిక అవకతవకలపై జేపీసీ విచారణ చేపట్టాలని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెంకటేశ్ డిమాండ్ చేశారు. అదానీ ఆర్థిక అవకతవకలపై విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ ఆదేశాల మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎల్పీ నాయకులు మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే సీతక్క, కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి గాంధీభవన్ నుంచి రాజ్‌భవన్ వరకు నిర్వహించిన పాదయాత్ర కార్యక్రమంలో చారిమనార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెంకటేశ్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సుల్తాన్‌బజార్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయసారథి అన్నారు. తెలంగాణ ఉమెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షురాలు సైఫా బేగం ఆధ్వర్యంలో బుధవారం కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన మహిళా అధికారులకు సత్కరించారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ.. వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా అధికారులు, ఉద్యోగుల పట్ల నేటికీ కొంత వివక్ష కొనసాగుతుందన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ సరోజిని, పద్మజ, అంజని, సుభాషిణి, షహిఫా, వసంత, రమ్య, రేష్మా, మంజులత, సముద్ర వెంకటమ్మ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు మెరుగైన ఫలితాలు సాధించాలి

యాకుత్‌పురా: మహిళలు అన్ని రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని జెంత్రూమ్ గోయితే సంస్థ డైరెక్టర్ అమితా దేశాయ్, షాహీన్ ఉమెన్స్ అండ్ రిసోర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జమీలా నిషాత్ సూచించారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ మహిళా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు గోదావరి దంగేపై మరాఠీ నుంచి తెలుగు, ఉర్దూలో అనువాదించిన పుస్తకాలను బుధవారం మొఘల్‌పురా ఉర్దూఘర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహారాష్ట్రకు చెందిన గోదావరి దంగే 30 ఏళ్లుగా మహిళల కోసం ఉత్తమ సేవలందిస్తున్నారన్నారు. సామాజిక కార్యకర్త ఆశలత, అనువాదకులు పద్మ, శరయ్య గుర్యే, షాహీన్ సభ్యులు షాహిదా, సుల్తానా, అర్చన పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అమితా దేశాయ్, జమీలా నిషాత్

సృజనాత్మకతను వెలికితీయాలి

గన్‌ఫౌండ్రీ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ 11వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అంతకు ముందు విద్యార్థుల దేశభక్తి, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

అనుపమ మృతి పార్టీకి తీరని లోటు



అబిడ్స్: బీఆర్‌ఎస్ నాయకురాలు, నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ సీహెచ్. ఆనంద్‌గౌడ్ సతీమణి, అనుపమ మృతి పార్టీకి తీరని లోటు అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. రెడ్‌రోజ్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సంతాప కార్యక్రమంలో మంత్రి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె పార్టీకి ఎనలేని సేవలు చేసిందన్నారు. కుటుంబసభ్యులు ఆనంద్ గౌడ్, ఇతర సభ్యులను మంత్రి పరామర్శించారు.

సమాజ సేవతోనే మానసిక తృప్తి

అబిడ్స్: సమాజ సేవ చేయడంతోనే మానసిక తృప్తి ఉంటుందని రాచకొండ క్రైమ్ డీసీపీ పరవస్తు మధుకర్ స్వామి పేర్కొన్నారు. సీతారామ్ బాగ్‌లోని ఈశ్వర్ చందర్ ఆస్పత్రిలో పరావస్తు క్రియేటీవ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రీన్‌ల్యాండ్స్, సేవా భారతి, రాంకి ఎన్విరాన్‌మెంట్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ఫ్రీ మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. మధుకర్‌స్వామి హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించి ప్రసంగించారు. తమ స్వచ్ఛంద సంస్థలు నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. లయన్ విద్యాభూషణ్, లయన్ రఘునాథ్‌రెడ్డి, ప్రొఫెసర్ రాజ్‌కుమర్, ప్రొఫెసర్ లక్ష్మి, డాక్టర్ గులాబ్ రాణి పాల్గొన్నారు.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా



గోల్కొండ: విద్యార్థుల విజయ యాత్ర ఎస్‌ఎస్‌సీ నుంచి ప్రారంభమవుతుందని టోలిచౌకిలోని వీనస్ హైస్కూల్ కరస్పాండెంట్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. బుధవారం టోలిచౌకి డీలక్స్ కాలనీలోని వీనస్ హై స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా 9వ, 10వ తరగతి విద్యార్థులు ఎంతో ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహ్మద్ హిదాయత్ అలీఖాన్ మాట్లాడుతూ.. 25 ఏళ్ల నుంచి వీనస్ హైస్కూల్‌ను ఉత్తమ ప్రమాణాలతో నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ హన్సారీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీలో ఆకాశవాణి శోభకృతు ఉగాది ఉత్సవాలు

నాంపల్లి: ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో శోభకృతు ఉగాది ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఉగాది శోభ శీర్షికతో పండిత ప్రసంగాలు, భక్తి సంగీతం, యువ కవి సమ్మేళనం నిర్వహించారు. అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, తెలుగు వేదకవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు, ఆకాశవాణి పూర్వ డైరెక్టర్ జనరల్ నూకల వేణుధర్ రెడ్డి, సినీ నటులు తనికెళ్ల భరణి, ప్రముఖ కవి డాక్టర్ ఆర్ఏ.పద్మనాభ రావు, ఆధ్యాత్మికవేత్త వీఎస్ఆర్ మూర్తి హాజరై ప్రసంగించారు. అనంతరం ఆకాశవాణి అజ్ఞాత సూర్యులకు సత్కారం చేశారు. సభా ప్రారంభంలో 22 మంది యువ కవులు కవి సమ్మేళనంలో పాల్గొని శోభకృతు నామ సంవత్సరానికి తమ కవితా మాధుర్యంతో ఘనంగా స్వాగతం పలికారు. అలాగే జెఎస్.శ్రీరామ్ బృంద సమర్పించిన నామ సంకీర్తన భక్తి సంగీతం అలరింపజేసింది.



మాట్లాడుతున్న డాక్టర్ కేవీ.రమణాచారి

క్లినికల్ నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు స్కిల్ ల్యాబ్ దోహదం



స్కిల్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఎంఈ రమేష్‌రెడ్డి

సుల్తాన్‌బజార్: వైద్య విద్యను అభ్యసించే వైద్యులు క్లినికల్ నైపుణ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు స్కిల్ ల్యాబ్ దోహదపడుతుందని డీఎంఈ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం కోఠిలోని ఉస్మానియా వైద్య కళాశాలలో స్కిల్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ప్రత్యేకతలు కలిగిన ఉస్మానియా మెడికల్ కళాశాలలో మొట్టమొదటి సారిగా స్కిల్ ల్యాబ్‌ను ప్రారంభించామని తెలిపారు. స్కిల్ ల్యాబ్‌కు నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్టు కింద ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ రిసెర్చ్ నిధులను సమకూర్చిందని తెలిపారు. ఈ కేంద్రం ప్రతి సంవత్సరం దాదాపు 500 మంది యూజీ, పీజీ వైద్య విద్యార్థులకు, పారా మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ అవసరాలు తీరుస్తుందన్నారు. ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డి, కుటుంబ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ మేడోజు, స్కిల్ ల్యాబ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పాండునాయక్, ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, డాక్టర్ గంగాభవాని, డాక్టర్ కరుణ, డాక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శ్రీకాంత్



రవీందర్ సింగ్‌ను కలిసిన శ్రీకాంత్ తదితరులు

దూద్‌బౌలి: హైదరాబాద్ జంట నగరాల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పురానాపూల్‌కు చెందిన పుస్తె శ్రీకాంత్ నియమితులయ్యారు. బుధవారం రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాయికోటి రాజు నియమాక పత్రాన్ని ఆయనకు అందజేశారు. పుస్తె శ్రీకాంత్ మాట్లాడుతూ.. రేషన్ డీలర్ల ద్వారా సరుకులను సక్రమంగా పంపిణీ చేయడమే కాకుండా రేషన్ డీలర్ల సమస్యలను పౌర సరఫరాల శాఖతో పాటు మంత్రి దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా సివిల్ సప్లయ్ కమిషనర్ అనిల్‌కుమార్, జాయింట్ కమిషనర్ ఉషారాణితో పాటు రాష్ట్ర సివిల్ సప్లయ్ చైర్మన్ రవీందర్ సింగ్, డీఎస్ఓ రమేశ్, రేషన్ డీలర్ల సంక్షేమం సంఘం జనరల్ సెక్రటరీ జానకీరాం, ఆలిండియా సెక్రటరీ కాశం కృష్ణమూర్తి, జేఏసీ నాయికోటి రాజు మర్యాదపూర్వకంగా కలిశారు.